సాక్షి ఖమ్మం

గురువారం । 16 । నవంబర్ । 2023

పాలేరు, ఖమ్మంలో మూడేసి ఈవీఎంలు



బరిలో మిగిలిన అభ్యర్థుల సంఖ్య తేలడంతో అధికారులు స్వతంత్రులకు గుర్తులు కేటాయించారు. అలాగే, ఈవీఎంల సంఖ్యపై కూడా స్పష్టత వచ్చింది. పాలేరులో 37మంది అభ్యర్థులు ఉండగా 'నోటా'తో కలిపి 38 గుర్తులను ఈవీఎంలపై పొందుపర్చాల్సి ఉంటుంది. ఒక్కో ఈవీఎంలో 16గుర్తులకు చోటు ఉండగా, ఇక్కడ మూడు ఏర్పాటుచేస్తారు. అలాగే, ఖమ్మంలో 32మంది అభ్యర్థులు, ఒక నోటా కలిపి 33 గుర్తులు కావడంతో ఇక్కడా మూడు ఈవీఎంలు అవసరమవుతాయి. ఇక కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, పినపాకలో రెండేసి ఈవీఎంలు, మధిర, అశ్వారావుపేట, భద్రాచలం, వైరాలో ఒక్కొక్కటి ఏర్పాటుచేయాల్సి ఉంటుంది.


గరిష్టం / కనిష్టం
33° / 19°

వాతావరణం
జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. సాయంత్రం తర్వాత చలి గాలులు మొదలవుతాయి.

బరి ఖరారు..!

ఎన్నికల సమరంలో పోటీ పడే అభ్యర్థులెవరో ఖరారైంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగియగా.. నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న వారి వివరాలను అధికారులు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 214 మంది పోటీలో ఉండగా.. ఖమ్మం జిల్లాలో 119 మంది, భద్రాద్రి జిల్లాలో 95 మంది మిగిలారు. నిలిచారు. అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలో 37 మంది, అత్యల్పంగా వైరా నియోజకవర్గంలో 12 మంది పోటీ పడుతున్నారు. పోటీ ఖరారు కావడంతో అభ్యర్థులు ఇక ప్రచారాన్ని మరింత ఉధృతం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 214 మంది పోటీ
- ఖమ్మం జిల్లాలో 119, భద్రాద్రి జిల్లాలో 95 మంది
- అత్యధికంగా పాలేరులో 37 మంది, అతి తక్కువగా వైరా నుంచి 12 మంది
- నామినేషన్ల ఉపసంహరణతో తేలిన అభ్యర్థుల సంఖ్య
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు తప్పిన రెబెల్స్ బెడద
- ఇక ప్రచారంపై దృష్టి సారించనున్న అభ్యర్థులు



నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య

నియోజకవర్గం	అభ్యర్థులు
పాలేరు	37
ఖమ్మం	32
కొత్తగూడెం	30
సత్తుపల్లి	23
ఇల్లెందు	20
పినపాక	18
మధిర	15
అశ్వారావుపేట	14
భద్రాచలం	13
వైరా	12
మొత్తం	214

నియోజకవర్గాల వారీగా...

- ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీపీఎం నుంచి యర్రా శ్రీకాంత్, జనసేన నుంచి మిరియాల రామకృష్ణతోపాటు మొత్తం 32మంది పోటీలో ఉన్నారు. ఇక్కడ 36 నామినేషన్లు అర్హత సాధించగా.. నలుగురు ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ నువ్వా – నేనా అన్నట్లు సాగనుంది.
- పాలేరు నియోజకవర్గం నుంచి ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 37 మంది బరిలో నిలవడం గమనార్హం. ఇక్కడ 40 మంది నామినేషన్లు అర్హత సాధించగా.. ముగ్గురు ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా కందాల ఉపేందర్‌రెడ్డి, సీపీఎం నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ పడుతున్నారు. వీరితోపాటు బీఎస్పీ, బీజేపీ, ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లు ఉన్నారు. ఎక్కువ మంది అభ్యర్థులు పాలేరులోనే ఉండడంతో ఇక్కడ ఎన్నిక రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.
- మధిర నియోజకవర్గంలో 15 మంది పోటీలో ఉన్నారు. ఇక్కడ 17 నామినేషన్లు అర్హత సాధించగా.. ఇద్దరు ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ నుంచి లింగాల కమల్‌రాజ్, సీపీఎం నుంచి పాలడుగు భాస్కర్ పోటీ పడుతున్నారు. మధిరలో బీజేపీ సైతం తమ అభ్యర్థిని పోటీలో దింపగా, పలువురు ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ నెలకొనడంతో మధిర నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారనే చర్చ సాగుతోంది.
- వైరా నియోజకవర్గంలో ఉమ్మడి జిల్లాలోనే అతితక్కువగా 12 మంది పోటీలో ఉన్నారు. మొత్తం 15 నామినేషన్లు అర్హత సాధించగా.. ముగ్గురు ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి మాలోతు రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ నుంచి బానోతు మదన్‌లాల్, సీపీఎం నుంచి భూక్యా వీరభద్రం, బీఎస్పీ నుంచి బానోతు రాంబాబు పోటీలో నిలిచారు. వీరితోపాటు జనసేన, విద్యార్థుల రాజకీయ పార్టీతోపాటు పలువురు ఇండిపెండెంట్లు ఎన్నికల సంగ్రామంలో సై అంటున్నారు.
- సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం 25నామినేషన్లు అర్హత సాధించగా ఇద్దరు ఉపసంహరించుకోవడంతో 23 మంది బరిలో మిగిలారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ నుంచి మట్టా రాగమయి మధ్య పోటీ నెలకొంది. వీరితోపాటు బీఎస్పీ నుంచి శీలం వెంకటేశ్వరరావు, సీపీఎం నుంచి మాచర్ల భారతి, బీజేపీ నుంచి నంబూరి రామలింగేశ్వరరావుతో పాటు పలువురు ఇండిపెండెంట్లు పోటీ పడుతున్నారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసిన సీపీ



స్ట్రాంగ్ రూంలో పరిశీలిస్తున్న సీపీ వారియర్

మధిర: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మధిర మండలం ఖాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో ఈవీఎంలను భద్రపరిచారు. ఈమేరకు స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ బుధవారం తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేయడంతో పాటు సిబ్బంది 24గంటల పాటుట అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏసీపీ రవి, మధిర సీఐ జాటోత్ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి విక్రయాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు పత్తి విక్రయించే రైతులు తమ ఆధార్ నంబర్‌ను బ్యాంకు వెబ్‌సైట్‌లో అనుసంధానం చేసుకోవాలని ఖమ్మం మార్కెట్ ఉన్నతిశ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం సూచించారు. అలాగే, రైతులు తమ బ్యాంకు ఖాతా మనుగడలో ఉందా, లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. బ్యాంకు ఖాతా మనుగడలో లేకపోతే ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు. సీసీఐకి పత్తి విక్రయించే సమయాన బ్యాంకు ఖాతా మనుగడలో ఉంటేనే నగదు జమ అవుతుందని ఆయన తెలిపారు.

గ్రహణమొర్రి బాధితులకు ఉచిత శస్త్రచికిత్స

ఖమ్మంరూరల్: గ్రహణమొర్రి, గ్రహణశూలతో బాధపడుతున్న వారికి తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన ఉచితంగా శస్త్రచికిత్స చేయించనున్నట్లు ఎంఈఓ శ్యాంసన్ తెలిపారు. ఆరు నెలల నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి సౌజన్యంతో ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. వివరాలను మండల వనరుల కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

ఇటు అభ్యర్థి.. అటు అభివృద్ధి

- ఇన్నాళ్లు పట్టించుకోని వారు ఇప్పుడు ఎందుకు?
- దోచుకోవడం, దాచుకోవడమే కాంగ్రెస్ తీరు
- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కూరగాయల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: కంటి ముందు అభ్యర్థి, ఇంటి ముందు అభివృద్ధి కనిపిస్తుంటే ఇతర పార్టీల అభ్యర్థులు ఎందుకు అవసరమో ప్రజలు ఆలోచించాలని ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. అధికారం, పదవులు కట్టబెడితే ఖమ్మంను పట్టించుకోని వారు ఇప్పుడు అంతా తామే చేశామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మంలోని బుర్హాన్‌పురం కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం చేసిన ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌ది పేదల ప్రభుత్వమని తెలిపారు. అభివృద్ధిని కాంక్షించే వారంతా పార్టీలోనే ఉండగా, ప్రజలు సైతం మరోమారు తనను గెలిపించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి మార్కెట్‌ను గుర్రాలపాడు తరలించాలని చూశారని, ఇప్పుడు అసత్యాలతో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పలువురు వ్యాపారులైన బీఆర్ఎస్ నాయకులు, సానుభూతిపరులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని, ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు తప్పుడు విధానాలు అవలంబిస్తున్నారని పువ్వాడ మండిపడ్డారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

ఎన్నికల సందర్భంగా ఖమ్మంలోని 37వ డివిజన్‌లో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జామా మాజిద్ సదర్ అజీజ్, వినోద్ లహోటి, ముత్తయ్య, మల్లికార్జున్‌తో పాటు పలు ముస్లిం కుటుంబాలు పువ్వాడ సమక్షాన బీఆర్ఎస్‌లో చేరాయి. ఇక ఖమ్మం 40వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలువురు కూడా బీఆర్ఎస్‌లో చేరగా, వారికి పువ్వాడ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో చంటి, యాసిన్, ఇమ్రాన్, హఫీజ్ , షోయబ్, గోపి, బుడే, మౌబుబ్ పాషా, ఘనీ, అఫాక్, షకీల్, అధిల్, యాసిన్ పాషా, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, మాజీ కార్పొరేటర్ షౌకత్ అలీ, కర్నాటి కృష్ణ, గార్లపాటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మణుగూరుకు రాహుల్‌గాంధీ

- త్వరలో ప్రియాంకగాంధీ పర్యటన కూడా..
- కరటక, దమనకులమైతే మా వెంట ఎందుకు తిరిగారు?
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి



సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో ఈనెల 17వ తేదీ శుక్రవారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రోడ్డుషో, కార్నర్ మీటింగ్ ఉంటుందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు రాహుల్‌గాంధీ రోడ్డుషో, ఆతర్వాత కార్నర్ మీటింగ్ ఉంటాయని... ఈ కార్యక్రమాలకు ప్రజలు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో త్వరలోనే ప్రియాంకగాంధీ పర్యటన కూడా ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్థికంగా కష్టాల్లో ఉన్నందునే ఎక్కడ రూ.పది, రూ.20 ఇస్తారో వాటితోనే ప్రచారం సాగించాలనే తాపత్రయంతో ఉందని చెప్పారు. కానీ రూ.లక్షల కోట్లు సంపాదించి ఆ నిధులపై కూర్చోలేదని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఆయన అన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రజలు కూడా గమనిస్తున్నారని పొంగులేటి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రమంతా ఖమ్మం వైపు చూస్తోందని తెలిపారు. కాగా, తమపై ఖమ్మం, అశ్వారావుపేట పర్యటనల్లో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, కరటక, దమనకులమైతే తమ కోసం మూడు నెలలు ఎందుకు తిరిగారని ప్రశ్నించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా, కుట్రలు పన్నినా ఈ ఎన్నికల్లో విజయం సాధించడం.. గోదావరి జలాలతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్‌కు చెందిన రఘునాథపాలెం సర్పంచ్ శారద సహా పలువురు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల సమక్షాన కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- 20లోగా ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతీ ఉద్యోగి విధుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. వెబ్ కాస్టింగ్, ఓటరు స్లిప్పుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన తదితర అంశాలపై బుధవారం ఆయన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పంచాయితీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి వసతుల కల్పనపై దృష్టి సారించాలని, పోలింగ్ కేంద్రాల ప్రహరీలకు రంగులు వేయించాలన్నారు. ప్రహరీలు చోట వెంటనే నిర్మించాలని సూచించారు. అలాగే, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేయనుండగా, 190 సమస్యాత్మక కేంద్రాల్లో బయట వైపు కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇక ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను అత్యవసర మందులతో నియమించాలని సూచించారు.

ఓటర్లకే స్లిప్పులు ఇవ్వాలి

ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీని గురువారం ప్రారంభించి ఈనెల 20 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అయితే, స్లిప్పులను ఓటర్లకు మాత్రమే అందజేయాలన్నారు. కాగా, పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తయినందున త్వరలోనే శిక్షణ ఉంటుందని తెలిపారు. ఫాం12డీ తిరస్కరిస్తే విషయాన్ని అభ్యర్థికి తెలియచేయాలన్నారు. ఇక కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న ఈవీఎం గోదాం పనులను కలెక్టర్ పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

అనుక్షణం నిఘా

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుండి చెక్‌పోస్టుల వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ అనుక్షణం నిఘా వేశామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో స్టాటిస్టిక్ సర్వైలెన్స్ బృందాలతో సమావేశమైన ఆయన తనిఖీల విషయమై పలు సూచనలు చేశారు. నిరంతర పర్యవేక్షణతో ప్రభుత్వ, ప్రైవేట్ తేడాలేకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, జెడ్పీసీఈఓ వీ.వీ.అప్పారావు, ఎస్ఈ చంద్రమౌళి, సీపీఓ ఏ. శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, డీఆర్డీఓ విద్యాచందన, డీఈఓ సోమశేఖరశర్మ, డీఏఓ విజయనిర్మల, జిల్లా సహకార శాఖ అధికారి విజయకుమారి, డీపీఓ హరికిషన్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, స్వీప్ నోడల్ అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ ఏఓ అరుణతోపాటు రాంబాబు, మదన్‌గోపాల్, మీనన్, సత్యనారాయణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఐటీ టవర్

- జిల్లా ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత
- దళితబంధు ఇవ్వకపోతే ఓట్లు అడగం
- బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య



మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య, పక్కనే ఎంపీ పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని.. ఇందులో భాగంగా ఈసారి గెలవగానే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ఐటీ టవర్ ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. వేంసూరు మండలం అమ్మపాలెంలో బుధవారం ఎంపీ బండి పార్థసారథిరెడ్డితో కలిసి ఆయన నియోజకవర్గ మేనిఫెస్టోను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఇచ్చిన హామీ మేరకు వచ్చే జనవరి కల్లా నియోజకవర్గంలోని దళితలందరికీ దళితబంధు ఇవ్వకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడగబోమని తెలిపారు. అలాగే, పది జిల్లాలను 33 జిల్లాలుగా చేసిన సీఎం కేసీఆర్‌తో మాట్లాడి.. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలను కలిసి సత్తుపల్లి జిల్లా సాధిస్తామని చెప్పారు. అంతేకాక బీసీ బంధు, డీడీలు కట్టిన గొల్లకుర్మకులకు యూనిట్లు, సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌ను అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని వివరించారు. కాగా, సింగరేణి బాంబు పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లను మరమ్మతు చేయించడమేకాక సంస్థ నుంచి మరిన్ని నిధులు సాధిస్తామని సండ్ర తెలిపారు. వేంసూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల్లో రెసిడెన్షియల్ పాఠశాల, నూతన బస్టాండ్, సెంట్రల్ లైటింగ్, జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, కల్లూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎంపీ బండి పార్థసారథిరెడ్డి ప్రకటించిన రూ.కోటి విరాళంతో కల్లూరులో నూతన బస్టాండ్ నిర్మిస్తామని, సత్తుపల్లిలో ఆటోనగర్ ఏర్పాటు, అటవీశాఖ స్థలాన్ని బదలాయించి ఇళ్ల స్థలాలకు కేటాయిస్తామని సండ్ర తెలిపారు. అంతేకాకుండా సీతారామ ద్వారా గోదావరి జలాలతో సత్తుపల్లి ప్రజల పాదాలను కడుగుతామని వివరించారు.

దేనికైనా సమాధానం చెపుతాం..

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కుట్రపూరితంగా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని సండ్ర వెంకటవీరయ్య మండిపడ్డారు. వ్యక్తిగత జీవితాలపై మాట్లాడడం తమకు చేతనైనప్పటికీ సంస్కారం ఉన్నందున అలా చేయడం లేదని తెలిపారు. తమకు ఓ వర్గం దూరమైందని దుష్ప్రచారం చేస్తున్నారని.. కానీ మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, సొసైటీ చైర్మన్లతో పాటు పలుచోట్ల సర్పంచ్‌లు, డీసీసీబీ డైరెక్టర్ పదవులను కమ్మవర్గానికే ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తన రాజకీయ జీవితంలో ఏ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టలేదని, వేధించలేదని తెలిపారు. కానీ ఇప్పుడు కొందరు గెలుపోటములు, మెజార్టీపై బెట్టింగ్ కాస్తూ నియోజకవర్గంలో విషసంస్కృతిని ప్రవేశపెట్టారని.. దీని ద్వారా ఎవరి జీవితాలను రోడ్డున పడేస్తారని సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించారు.

నామినేషన్ ఫీజు సేవా సదనానికి..



విరాళం అందజేస్తున్న కిశోర్

మధిర: మధిరకు చెందిన దొంతమాల కిశోర్‌కుమార్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీకి నామినేషన్ దాఖలు చేశారు. అయితే, ఆయన బుధవారం నామినేషన్ విత్ డ్రా చేసుకోగా, అధికారులు రూ.5 వేల ఫీజు వెనక్కి ఇచ్చారు. దీంతో నగదును పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనం నిర్వహణ కోసం విరాళంగా ఇవ్వగా సదనం బాధ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబంధు సమితి, బీఆర్ఎస్‌కు నల్లమల రాజీనామా

ఖమ్మంమయూరిసెంటర్: రైతు బంధు సమితి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ పదవితో పాటు బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు నల్లమల వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈమేరకు సీఎం కేసీఆర్‌కు లేఖ రాసినట్లు ఆయన ఓ ప్రకటనలో వెల్లంచారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతుబంధు సమితి లక్ష్యాలు నెరవేరకపోగా, ఐదేళ్లగా టీఏ, డీఏ కూడా సమకూర్చకలేదని తెలిపారు. ఇదికాక ప్రొటోకాల్ కల్పించాలని కోరినా స్పందన లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ తదితర పథకాలు రైతాంగానికి కొంత మేలు చేసినా, కాళేశ్వరం నిర్మాణంలో డొల్లతనం బయటపడిందని ఆయన తెలిపారు.

రూ.3.50 లక్షల నగదు పట్టివేత

ఖమ్మంక్రైం: సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3.50లక్షల నగదును ఖమ్మం త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని డీ మార్ట్, గాంధీచౌక్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఇద్దరి నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఇల్లెందు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం



మొదటిసారి ఎన్నికల విధుల్లో..

ఇప్పటివరకు శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పంచాయతీ కార్యదర్శులకు భాగస్వామ్యం కల్పించిన సందర్భాలు లేవు. కేవలం పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో మాత్రమే వీరికి విధులు కేటాయించేవారు. కానీ ఈసారి మొదటిసారిగా పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల విధులను అప్పగించింది.



ఓటు వేస్తారా..?

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నది ఎన్నికల సంఘం నినాదం. ఇందుకోసం కొద్దినెలలుగా ఓటు హక్కు నమోదు చేయించడమే కాక అందరినీ పోలింగ్ స్టేషన్‌కు రప్పించేందుకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు మాత్రం ఈసారి ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. – ఇల్లెందురూరల్

ఎటూ పాలుపోని స్థితిలో పంచాయతీ కార్యదర్శులు

- పోస్టల్ బ్యాలెట్ కోరుతున్న పల్లె ఉద్యోగులు
- ఆర్డర్ కాపీ లేకపోవడంతో సాధ్యం కాదంటున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 1,063 మంది కార్యదర్శులు

వెయ్యి మందికి పైగానే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 479 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో 362 మంది రెగ్యులర్ కార్యదర్శులు, 92 మంది జేపీఎస్‌లు, 25 మంది ఓపీఎస్‌లు ఉన్నారు. ఇక ఖమ్మం జిల్లాలో 584 మంది పంచాయతీ కార్యదర్శులకు గాను 504 మంది రెగ్యులర్, 80 జేపీఎస్‌లు పనిచేస్తున్నారు. ఇందులో కొందరికి బీఎల్ఓలుగా, మరికొందరికి ఆర్ఓలుగా విధులు అప్పగించారు. ఈ అవకాశం కూడా తక్కువ మందికి కల్పించారు. ఇక మిగిలిన పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 29, 30వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, ఇతర సిబ్బందికి సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత చేపట్టాలని ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. అంటే పోలింగ్ సందర్భంగా రెండు రోజులపాటు కార్యదర్శులంతా అక్కడే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

మౌఖిక ఆదేశాలే..

సాధారణంగా ఎన్నికల విధులు కేటాయించిన అధికారులకు ఎన్నికల సంఘం ఆర్డర్ కాపీలు అందజేస్తుంది. ఈ కాపీతో ఫాం 12 ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. ఇలా అతి తక్కువ మంది పంచాయతీ కార్యదర్శులకు ఆర్డర్ కాపీలు అందటంతో వీరు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మిగతా వారందరూ ఆర్డర్ కాపీ ఎప్పుడు వస్తుందా అని చూస్తుండగా.. ఒకవేళ కాపీ అందకపోతే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఓటు వేసేది ఎలా..?

ఎన్నికల విధులు కేటాయించని గ్రామపంచాయతీ కార్యదర్శులు పోలింగ్ సందర్భంగా రెండు రోజుల పాటు తమ గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఇప్పటికే అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. కానీ, ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ స్వగ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వారికి ఆయా గ్రామాల్లోనే ఓటు హక్కు ఉంటుంది. పోలింగ్ రోజున పోస్టింగ్ ఉన్న గ్రామంలో విధులు నిర్వర్తిస్తే స్వస్థలంలో ఓటు హక్కు ఎలా వినియోగించుకుంటారన్నది తేలడం లేదు. ఈ విషయమై ఎన్నికల అధికారులు స్పందించి పోలింగ్ బూత్‌ల వద్ద సాధారణ విధుల్లో ఉండే గ్రామపంచాయతీ కార్యదర్శులకు పోలింగ్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తారా? లేదంటే ఓటు హక్కు దూరం చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

హెడ్‌క్వార్టర్‌లో ఉంటేనే..



గ్రామపంచాయతీ కార్యదర్శులు ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఇప్పటికే ఎన్నికల అధికారులను సంప్రదించాం. కానీ, పంచాయతీ విధుల్లో ఉండే కార్యదర్శులు విధిగా హెడ్‌క్వార్టర్‌లో నివసిస్తూ, అక్కడే ఓటు హక్కు కలిగి ఉండాలనే నిబంధన ఉందని అధికారులు తెలిపారు. దీంతో వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం కుదరదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

–బాలరాజు, ఎంపీడీఓ, ఇల్లెందు

ఆదర్శ మూర్తులు..

- ఇప్పటికీ గుర్తుండిపోయిన తొలితరం ఎమ్మెల్యేలు
- నిస్వార్థ సేవకులకే దక్కిన విజయం
- తొలినాళ్లలో ఉమ్మడి జిల్లాలో ఐదు నియోజకవర్గాలే
- మూడు ద్విసభ్య, రెండు ఏకసభ్య నియోజకవర్గాలు

వైరా: పూర్వపు హైదరాబాద్ సంస్థాన రాజకీయ రంగానికి ఖమ్మం గుమ్మంగా ఉండేది. ఆ రోజుల్లో ఖమ్మం ప్రత్యేక జిల్లా కాకున్నా నాటి రాజకీయాల్లో ఈ ప్రాంత నాయకులే ఎక్కువగా ఉన్నారు. వరంగల్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న తాలూకాను విడదీసి 1953లో ఖమ్మం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారు. మొదటి సార్వత్రిక ఎన్నికల సమయంలో ఖమ్మం ప్రత్యేకమైన జిల్లాగా ఉండేది కాదు. అప్పట్లో నియోజక వర్గాలు రెండు రకాలుగా ఉండేవి. ద్విసభ్య నియోజక వర్గాలు, ఏక సభ్య నియోజక వర్గాలు ఉండగా.. ద్విసభ్య నియోజక వర్గాల్లో ఒకటి జనరల్ స్థానం, ఇంకొకటి రిజర్వ్‌డ్‌గా ఉండేది. ఏక సభ్య నియోజకవర్గాల్లో 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఖమ్మం, ఇల్లెందు, భద్రాచలం ద్విసభ్య నియోజకవర్గాలుగా, మధిర, వేంసూరు ఏక సభ్య నియోజకవర్గాలుగా ఉన్నాయి. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను తిరస్కరించి పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థులైన కమ్యూనిస్టులను గెలిపించారు. తొలిసారిగా ఈ జిల్లా నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టిన నాయకులంతా నిస్వార్థంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా ఆదర్శ నాయకులుగా పేరు సాధించారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా వారి జీవితం ఆడంబరాలు లేకుండా సాదాసీదాగా ఉండేది.



కొండబోలు వెంకయ్య, మధిర తొలి ఎమ్మెల్యే

ఎవరెవరు గెలిచారంటే..

- 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఖమ్మం ద్విసభ్య నియోజక వర్గం నుంచి పీడీఎఫ్ నుంచి బుగ్గవీటి కృష్ణయ్య, రెంటాల బాలగురుమూర్తి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కృష్ణయ్యకు 33,726 ఓట్లు రాగా, గురుమూర్తికి 32,155 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కొలిపాక కిషన్‌రావుకు 7,461 ఓట్లు, ఎస్.శ్రీగురు ప్రకాష్‌కు 7,904 ఓట్లు మాత్రమే రావటంతో వీరు ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో మానికొండ వెంకట సుబ్బయ్య (స్వతంత్ర) 3,803 ఓట్లు, చింతమళ్ల పురుషోత్తం (ఎస్సీ ఫెడరేషన్) 5,384 ఓట్లు, మాదిరాజు రాంకిషన్‌రావు (స్వతంత్ర) 3,768 ఓట్లు, గెంటాల ఉపేందర్‌రావు (కేఎంపీపీ)కి 4,047 ఓట్లు లభించాయి. మొత్తం ఓట్లు 98,248 కాగా మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు పోటీ చేశారు.
- ఇల్లెందు ద్విసభ్య నియోజక వర్గం నుంచి మొత్తం ఐదుగురు పోటీ చేశారు. వారిలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) నుంచి పోటీ చేసిన కె.ఎల్. నర్సింహారావు సోషలిస్టు పార్టీ తరఫున పోటీ చేసిన పూకె నాగయ్య గెలుపొందారు. ఈ ఎన్నికల్లో నర్సింహారావుకు 27,632 ఓట్లు రాగా నాగయ్యకు 8,639 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్.శంకరయ్యకు 5,475 ఓట్లు, సోషలిస్టు పార్టీ తరఫున పోటీ చేసిన కె.సోమయాజులుకు 7,562 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సాయం రామగోవిందంకు 8,608 ఓట్లు లభించాయి. అతి తక్కువ ఓట్ల తేడాతో రామగోవిందం ఓడిపోయారు. అప్పట్లో ఈ నియోజకవర్గంలో మొత్తం 57,923 ఓట్లు ఉన్నాయి.
- భద్రాచలం ద్విసభ్య నియోజకవర్గం నుంచి తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానం నుంచి ప్రజాపార్టీ తరఫున వైవీ.కృష్ణారావు గెలుపొందారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి ప్రజాపార్టీ తరఫున కారం బాపన్న దొర విజయం సాధించారు.
- మధిర ఏక సభ్య నియోజకవర్గంలో తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఆరుగురు పోటీ చేశారు. పీడీఎఫ్ నుంచి పోటీ చేసిన కొండబోలు వెంకయ్య తొలి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి మాడపాటి రామచంద్రయ్యకు 7,253 ఓట్లు రావటంతో ఓడిపోయారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన గంధం మాణిక్యరావుకు 1,269 ఓట్లు, శాఖమూరి నారాయణకు 3,107 ఓట్లు, పర్చా శ్రీనివాసరావుకు 1,838 ఓట్లు, పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ తరఫున పోటీ చేసిన వట్టికొండ రామకోటయ్యకు 1,065 ఓట్లు లభించాయి. అప్పట్లో ఈ నియోజకవర్గంలో మొత్తం 37,563 ఓట్లు ఉన్నాయి.
- వేంసూరు ఏక సభ్య నియోజకవర్గం నుంచి జరిగిన తొలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కందిమళ్ల రామకృష్ణారావు విజయం సాధించారు. ఆయనకు ఈ ఎన్నికల్లో 16,092 ఓట్లు లభించాయి. ఇదే ఎన్నికల్లో పోటీ చేసిన రాజకీయ దిగ్గజాలైన జలగం వెంగళరావు (స్వతంత్ర), బొమ్మకంటి సత్యనారాయణ(కాంగ్రెస్)ను ఆయన ఓడించారు. వీరిలో బొమ్మకంటికి 4,580 ఓట్లు రాగా, జలగంకు 15,543 ఓట్లు లభించాయి. మొత్తం ముగ్గురే ఇక్కడ బరిలో నిలిచారు. హేమాహేమీలైన ఈ ముగ్గురు పోటీ చేయడంతో అందరూ దృష్టి సారించారు. అప్పట్లో ఈ నియోజకవర్గంలో మొత్తం 46,215 ఓట్లు మాత్రమే ఉన్నాయి.
- ఈ నియోజక వర్గాల నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టిన మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కూడా వివిధ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో వారి వాణిని వినిపించారు. వ్యక్తిగత స్వార్థాల కోసం కాకుండా ప్రజాసేవకే అధిక భాగం సమయం కేటాయించి పనిచేసే వారని వీరికి పేరు. ఆ విధంగా వీరికి ప్రజల్లో గుర్తింపు ఉంది. నేటికి కూడా తొలితరం నాయకులను అనేక మంది గుర్తు చేసుకుంటుండడం విశేషం.

క్లుప్తంగా

హై షుగర్‌తో అవస్థ

- బాలిక ఆరోగ్యంపై తల్లిదండ్రుల ఆందోళన
- దాతల చేయూత కోసం ఎదురుచూపులు



తల్లిదండ్రులతో కుమార్తె నదియా

కల్లూరు: కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన నల్లగట్ల ప్రభాకర్ – రమ్య కుమార్తె ఆరేళ్ల బాలిక నదియా కొద్దినెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. హైదారాబాద్‌లో కూలి పనులు చేస్తూజీవనం సాగిస్తున్న తల్లిదండ్రులు పాపను ఆస్పత్రికి తీసుకెళ్లగా 600 ఎంజీ హై షుగర్‌తో బాధపడుతోందని వైద్యులు నిర్ధారించారు. ఇప్పటివరకు తమ వద్ద డబ్బుతో పాటు తెలిసిన వారి వద్ద చేసిన అప్పులతో చికిత్స చేయించారు. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో పని వదిలేసి స్వగ్రామమైన ఎర్రబోయినపల్లి వచ్చారు. పక్కనే ఉన్న తిరువూరులో నదియాకు వైద్యం చేయిస్తున్నారు. కానీ ఆస్పత్రి ఖర్చులు, మందులకు సరిపడా డబ్బు లేక దాతల కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు స్పందించి 79975 65311(ఫోన్ పే) నంబర్ ద్వారా సంప్రదించాలని వారు కోరుతున్నారు.

బైక్ చోరీల నిందితుడు అరెస్ట్

గతంలో ఆయనపై 22 కేసులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు బుధవారం ద్విచక్రవాహనాల చోరీల నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడెం పాత బస్‌డిపో వద్ద ఎస్‌ఐ డి.విజయకుమారి సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. తాను నడుపుతున్న బైక్‌ను అపహరించి తీసుకొస్తున్నట్లు అంగీకరించాడు. గార్ల – బయ్యారానికి చెందిన కృష్ణపై పలు పోలీస్‌స్టేషన్లలో 22 కేసులు నమోదై ఉన్నాయని, అతడి వద్ద ఉన్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు



(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,500	19,000
పత్తి	6,775	4,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా...

- బాలలను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ
- జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు
- ఈనెల 22న జిల్లా స్థాయిలో నిర్వహణ



గతేడాది జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రాజెక్ట్ వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థిని

ఖమ్మంసహకారనగర్: నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. బాలలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల నిర్వహణకు సిద్ధమయ్యారు. జాతీయ స్థాయిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ), కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్‌సీఎస్‌సీ(జాతీయ శాస్త్ర, సాంకేతిక సమాచారం మండలి) 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహిస్తుంది. జిల్లాలోని 419 పాఠశాలల్లో 82,925 మంది విద్యార్థులు ఉండగా.. ఎక్కువ మంది పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు దృష్టి సారించారు.

22న జిల్లా స్థాయి పోటీలు

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2023–24 పోటీలను ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలోని విస్‌ఫీల్డ్ హైస్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తుండగా.. ప్రతీ రెండేళ్లకోసారి అందులోని ప్రధాన అంశం, ఉప అంశాలు మారుతుంటాయి. ఈ ఏడాది ఖమ్మం విస్‌ఫీల్డ్ హైస్కూల్(మధురానగర్ రోడ్ నెంబర్–4)లో ఈ సైన్స్‌ఫేర్ నిర్వహణకు నిర్ణయించారు.

అంశాలు ఇవే..

ఈ ఏడాది జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాన అంశంగా 'ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం'గా నిర్ణయించారు. అలాగే, ఉప అంశాలుగా పర్యావరణ వ్యవస్థను తెలుసుకోండి, ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ అధారిత విధానం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణగా ప్రకటించారు. ఇందులో ప్రధాన అంశంతో పాటు ఉప అంశాల్లో ఏదోఒకటి ఎంచుకోవాలి. ఇద్దరు విద్యార్థులు గైడ్ టీచర్ సాయంతో ఎంచుకున్న ఉప అంశానికి అనుగుణంగా సర్వే, పరిశీలన, ప్రశ్నావళి, కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్ట్ రూపొందించాల్సి ఉంటుంది.

జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిస్తే...

ఈనెల 22వ తేదీన జరిగే జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ కూడా ప్రతిభ చాటితే జాతీయ స్థాయికి పంపిస్తారు. జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. కాగా, గత ఏడాది నిర్వహించిన జాతీయ బాలల కాంగ్రెస్‌కు 120 ప్రాజెక్టులు రాగా.. ఇందులో ఆరు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి.



బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రాజెక్ట్‌తో విద్యార్థులు (ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం...



విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ఎక్కువ ప్రాజెక్టులు తీసుకొచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. ఈ విషయంలో ఉపాధ్యాయులు కూడా సూచనలు చేయాలి. తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చు. – ఎనుమల వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్

దూసుకొచ్చిన మృత్యువు

కారు ఢీకొట్టడంతో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలు మృతి



కవిత (ఫైల్)

పాల్వంచ: తెల్లవారుజామున మెయిన్ రోడ్డు శుభ్రం చేసే పనులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలికి కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. అప్పటివరకు తోటి కార్మికులతో సరదాగా వచ్చి విధుల్లో చేరిన కొద్ది నిమిషాలకే ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గట్టాయిగూడెంనకు చెందిన వడ్లకొండ కవిత (35) పాల్వంచ మున్సిపాలిటీలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికురాలిగా పనిచేస్తోంది. రోజు మాదిరే బుధవారం తెల్లవారుజామున విధుల్లో చేరింది. అప్పటివరకు తోటి కార్మికులతో మాట్లాడుకుంటూ మున్సిపల్ ట్రాక్టర్‌లో బీసీఎంరోడ్‌లోని నవభారత్ కేఎస్ఎం బంక్ సమీపంలో రోడ్డుపక్కన చెత్తను ఎత్తే పనిలో నిమగ్నమైంది. అదే సమయంలో పాల్వంచ వైపు నుంచి కొత్తగూడెం వెళ్తున్న కారు ఒక్కసారిగా ఆమెను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆమె కొంతదూరం ఎగిరిపడింది. తీవ్ర గాయాలైన ఆమెను కారులోని వ్యక్తే కార్మికులతో కలిసి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం కారు డ్రైవర్ పరారయ్యాడు. అతడిని గుండాల మండలానికి చెందిన అశోక్‌గా గుర్తించారు. మృతురాలి భర్త లక్ష్మీనారాయణ కూలి పనులు చేస్తుంటాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు. తమతోఉన్న కవిత మృతి చెందడంతో తోటి కార్మికులు కన్నీరుమున్నీరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా పలువురికి గాయపడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని కమలాపురానికి చెందిన ఉరబెద్ది నాగమణి(35) బంధువులతో కలిసి ఆటోలో శుభకార్యానికి బయలుదేరింది. ఆటో గుర్రాలకుంట వద్దకు రాగానే వెనుక నుంచి మరో ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీ కొట్టగా నాగమణి అక్కడికక్కడే మృతి చెందగా, గొల్ల భద్రమ్మ, వెంకటలక్ష్మి, లక్ష్మి, లింగరాజు తదితరులు గాయపడ్డారు. క్షతగాత్రులకు పాల్వంచలో చికిత్స చేయించాక కొత్తగూడెం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం – గంగినేని రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుండి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం వైపు నుంచి వస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి(30) మృతి చెందగా, ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈనెల 12న ఖమ్మం నుండి విజయవాడ, 14న తణుకు నుండి తాడేపల్లిగూడెం బస్సు టికెట్లతో పాటు తాడేపల్లిగూడెం నుండి విజయవాడ, విజయవాడ నుంచి ఖమ్మంకు రైలు టికెట్లు మాత్రం ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 99636 41484, 87126 58607 నంబర్లలో సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ట్రాక్టర్ ట్రక్కు దగ్ధం

నేలకొండపల్లి: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాక్టర్ ట్రక్కు దగ్ధమైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మంగాపురంతండా నుంచి వల్లభికి వరి గడ్డి సరఫరా చేసేందుకు ట్రాక్టర్‌లో కూలీలు వెళ్లారు. గడ్డి లోడ్ చేశాక పైన ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగలు తాకడంతో ట్రాక్టర్‌కు నిప్పంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడుతుండగా కూలీలు పరుగులు తీయడంతో డ్రైవర్ అలాగే, ట్రాక్టర్ ముందుకు తీసుకెళ్లి ఇంజన్ నుంచి ట్రక్కును విడదీశాడు. ఈ ఘటనలో ట్రక్కు పూర్తిగా కాలిపోగా కూలీలు పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రఘునాథపాలెం మండలం ఖానాపురం హవేలీకి చెందిన రామారావు బుధవారం నేలకొండపల్లి మండలంలోని చెన్నారంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి బైక్‌పై బయయలుదేరాడు. నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద బైక్ అదుపు తప్పడంతో ఆయన కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను 108లో ఖమ్మం తరలించారు.

అదుపుతప్పి ఆటోట్రాలీ బోల్తా

కామేపల్లి: పత్తి లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన పత్తి వ్యాపారి గుడిమెట్ల సైదులు బుధవారం పత్తి లోడ్ చేసుకుని ఖమ్మం బయలుదేరాడు. ఈక్రమంలో ముచ్చర్ల క్రాస్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కలు దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. గువ్వలగూడెంకు చెందిన వృద్ధురాలు నర్సమ్మ, అనంతనగర్‌లో దీక్షిత్, సదాశివాపురానికి చెందిన ప్రియతమ్ బుధవారం గాయపడగా నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

ప్రమాదవశాత్తు చెరుకు తోట దగ్ధం

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు చెరుకు తోట దగ్ధమైన ఘటన మండలంలోని చెన్నారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు వెంకన్న, సంగయ్య, గోపి చెరుకు సాగు చేయగా, వీరి పక్క పొలంలోని రైతు బుధవారం చెత్తకు నిప్పటించాడు. దీంతో మంటలు ఎగిసిపడి రైతుల చెరుకు తోటలు కాలిపోవడమే కాక గ్రామం వైపు వస్తుండడంతో స్థానికులు బకెట్లతో నీళ్లు పోస్తూ అదుపు చేశారు. ఈ ఘటనలో దాదాపు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

రూ.2.50లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితుడు, గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో బుధవారం ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 10కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఖమ్మం ఎక్సైజ్ సీఐ–2 రాజిరెడ్డి ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహిస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుడ్డు రూ.2.50లక్షల విలువైన గంజాయితో పట్టుబడ్డాడు. తనిఖీల్లో ఎస్సై సరిత, సిబ్బంది మౌంకార్, నర్సింహ, వీరభద్రం, గురుప్రసాద్, సురేందర్, రాధ, భద్రమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

కొండచిలువ హతం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బల్లేపల్లి నుండి వేపకుంట్ల వెళ్లే రహదారిపై ఎనిమిది అడుగుల కొండచిలువను గ్రామస్తులు హతం చేశారు. ప్రధాన రోడ్డుపై బుధవారం కొండచిలువ వెళ్తుండగా స్థానికులు గుర్తించారు. సమీపంలో నివాసాలు ఉండడంతో ఆందోళనకు గురైన వారు దాన్ని హతమార్చారు.

మట్టి టిప్పర్లు స్వాధీనం

రఘునాథపాలెం: ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని జింకలతండా రోడ్డులో బుధవారం చేపట్టిన తనిఖీల్లో టిప్పర్లను స్వాధీనం చేసుకోగా, మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

పాడిరైతులపై 'సంగం డెయిరీ' దాడి

కర్రలు, రాడ్లు, రాళ్ల దాడిలో 15 మంది ఏలూరు జిల్లా రైతులకు గాయాలు

చేబ్రోలు: ఒప్పందం ప్రకారం తమకు ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు ఇవ్వడంలేదనే విషయాన్ని సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వచ్చిన రైతులపై డెయిరీ కిరాయి సిబ్బంది దాడిచేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతుల మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. రైతులు వాహనాలు దిగుతుండగానే డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర అనుచరులు బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీ వద్ద బుధవారం జరిగిన ఈ దాడిలో ఏలూరు జిల్లాకు చెందిన 15 మంది రైతులు గాయపడ్డారు. వీరిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం వేములపల్లి, రంగపాలెం గ్రామాల్లో ద్వారకామాయి డెయిరీ పాయింట్‌తో సంగం డెయిరీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం పాడి రైతులకు రూ.50 లక్షల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంది. ఈ మిల్క్ సెంటర్ నిర్వాహకులైన వేములపల్లి సర్పంచి ముసులూరి రాము, నర్సనపాలెం సర్పంచి కూరపాటి వెంకటేశ్వరరావు తమ పరిధిలో పాలు సేకరించి సంగం డెయిరీకి సరఫరా చేశారు. ఒప్పందంలో భాగంగా 14% బోనస్ ఇస్తామన్న డెయిరీ అధికారులు తరువాత మాట మార్చి నాలుగు శాతం మాత్రమే ఇస్తామనడంతో వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అక్కడ పోలీసు స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు కూడా చేశారు. గుడ్ ఫార్మర్స్‌గా గుర్తించి న్యాయం చేస్తామని మిల్క్ సెంటర్ నిర్వాహకులకు, రైతులకు వేములపల్లిలో సంగం డెయిరీ జీఎం కొల్లి ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆ హామీని కూడా నెరవేర్చలేదు. బోనస్ గురించి అడిగితే బోనస్ ఇవ్వడానికి పాలకవర్గం తీర్మానం చేయాల్సి ఉందని, 4% కన్నా ఎక్కువ ఇవ్వడం కుదరదని చెప్పారు. ఈ సమస్యను సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని అక్కడి రైతులు నిర్ణయించారు. దీనిపై వేములపల్లి, రంగపాలెం గ్రామ సర్పంచులతోపాటు సుమారు 30 మంది రైతులు బుధవారం ఆరు వాహనాల్లో సంగం డెయిరీకి వచ్చారు. రైతులకు న్యాయం చేయాలనే నినాదంతో కూడిన ప్లకార్డుల్ని వాహనాల్లో తీసుకొచ్చారు. రైతుల రాకను పసిగట్టిన సంగం డెయిరీ సిబ్బంది, గూండాలు యాజమాన్యం ఆదేశాలతో దౌర్జన్యానికి దిగారు. వందమంది కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతులపై దాడిచేశారు. రైతులు కారు దిగతుండగానే మీదపడి కొట్టారు. భయాందోళనలతో పరారవుతున్న రైతులను వెంటపడి మరీ కొట్టి గాయపరిచారు. ఐదుకార్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో 15 మంది రైతులు గాయపడ్డారు.



మాచర్లలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

ప్రజలతోనే మా పొత్తు

నెరవేర్చిన హామీలే నా ధైర్యం, జనమే నా నమ్మకం

వరికపూడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపనలో సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వచ్చే ఎన్నికల్లో తమ పొత్తు ప్రజలతోనే ఉంటుందని, పేద ప్రజల కోసమే తమ పార్టీ ఉందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నెరవేర్చిన హామీలు, ప్రజలే తన ధైర్యం, నమ్మకం అని స్పష్టం చేశారు. నేను విన్నాను, నేను ఉన్నాను అని పునరుద్ఘాటించారు. వైఎస్సార్‌కు, వైఎస్ జగన్‌కు తెలిసిందల్లా ప్రజల్లో నడవడం, ప్రజల గుండెల్లో ఉండటమేనన్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. వైఎస్సార్ పల్నాడు కరువు నివారణ పథకం కింద రూ.340.26 కోట్ల వ్యయంతో చేపడుతున్న వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి కీలకమైన అటవీ, పర్యావరణ అనుమతులు సాధించి బుధవారం ఆయన మాచర్లలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో పక్కనే నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ.. సాగు, తాగునీటి ఎద్దడి దశాబ్దాలుగా మన కళ్లెదుటనే కనిపిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందలేదన్న మాదిరిగా.. సముద్రంలో ప్రయాణిస్తున్న వారికి గుక్కెడు మంచి నీరు దొరకలేదన్న చందంగా ఇన్ని దశాబ్దాల పాటు కృష్ణమ్మ ఒడ్డున ఉన్న ఈ ప్రాంతానికి నది నీరు దక్కలేదని చెప్పారు. ఈ పరిస్థితిలో ప ల్నాటి ప్రాంత రూపురేఖలు మార్చేలా ఈ రోజు రూ.340 కోట్లతో వరికపూడిశెల ఎత్తిపోతల ద్వారా కృష్ణమ్మ నీరు అందిస్తామని గర్వంగా చెబుతున్నానన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మోసాల మాటలు నమ్మగలమా?

- గత చంద్రబాబు పాలనలో మనం మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాల చరిత్ర చూశాం. ఈ పెద్ద మనిషి 14 ఏళ్లు సీఎంగా పని చేసినప్పటికీ కనీసం ఒక మంచి పని చేశానని చెప్పి ఓటు అడగలేడు. అందుకే మళ్లీ మోసం చేసేందుకు, ప్రజల్ని వెన్నుపోటు పొడిచేందుకు వెనుకాడడు. ఇంటింటికి కేజీ బంగారం, బెంజ్ కారిస్తాను.. ఓటు వేయండి అని చంద్రబాబు అడుగుతాడు. 34 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చిన చరిత్ర లేదు. ఇలాంటి వ్యక్తి మన మాచర్లకు, పల్నాడుకు మరో ప్రాంతానికి నీరు ఇస్తానని చెబితే నమ్మగలమా? కన్నతల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు మాత్రం బంగారు గాజులు కొనిస్తానని ఒకడు అన్నాడట. ఈ పెద్దమనిషిని చూస్తుంటే ఆ మాటలు గుర్తుకొస్తాయి. చివరికి కుప్పానికి నీళ్లు కావాలన్నా.. కుప్పానికి రెవెన్యూ డివిజన్ కావాలన్నా చేసేది మీ బిడ్డే.



- ఒకాయన ఎప్పుడూ మంచానికే పరిమితమై ఉంటాడట. లేస్తే మనిషిని కాదంటాడట. కానీ మంచంలోంచి లేవడు. చంద్రబాబు పరిస్థితి కూడా ఇంతే. తాను చేసిన మంచి ఏమిటనేది ఎప్పుడూ చెప్పడు. ఆయన 2000 సంవత్సరంలో ఉంటే 2047 గురించి చెబుతాడు. ఇప్పుడేం చేస్తావంటే చెప్పడు. 50 ఏళ్ల విజన్ అంటాడు. 50 ఏళ్ల తర్వా ఏం జరగబోతోందని చెబుతాడట. ఎందుకంటే 50 ఏళ్ల తర్వాత ఎవడుంటాడో? ఎవడు పోతాడో? ప్రజల చెవుల్లో క్యాలీఫ్లవర్ పెట్టడం ఈజీ కదా అని ఆలోచిస్తాడు. ఇలాంటి బాబు మాటలు నమ్మగలమా?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వెన్ను పోటు వీరుడు

- సొంత కూతురును ఇచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన వాడు, రాష్ట్రంలోని కోటీ 50 లక్షల కుటుంబాలకు వెన్నుపోటు పొడవకుండా ఉంటాడా? ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అన్నారు. బీసీల తోకలు కత్తిరిస్తానని అహంకారంతో మాట్లాడాడు. ముస్లింలకు, ఎస్టీలకు కనీసం మంత్రి పదవి ఇవ్వని ఈ పెద్దమనిషి.. సమాజంలో ఏ వర్గానికై నా ఏనాడైనా న్యాయం చేశాడా? ఇలాంటి ఆయన నేను మారాను అంటే మనం నమ్మగలమా?
- గతంలో ఎన్నికలప్పుడు ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. జాబు రావాలంటే బాబు రావాలి అని ఊదరగొట్టి మోసం చేశాడు. మన ప్రభుత్వం వచ్చేదాక గవర్నమెంట్ ఉద్యోగాలు 4 లక్షలు ఉంటే మరో 2 లక్షల 7 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిది.

బాబు – దత్త పుత్రుడి మోసం

- తన బినామీ భూముల ధర బాగా పెరగాలన్న దుర్బుద్ధితో ఈ పెద్దమనిషి అమరావతిని ఒక రాజధానిగా భ్రమ కల్పించాడు. మూడు ప్రాంతాలకు ఏనాడైనా సమన్యాయం చేశాడా? తన హయాంలో పేదలకు కనీసం సెంటు భూమి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. మనం 31 లక్షల ఇంటి స్థలాలను నా అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుంటే కోర్టులకు వెళ్లి ఆపేందుకు కేసులు వేశారు.
- 2014లో ఇదే దత్తపుత్రుడు చంద్రబాబుతో కలిసే పోటీ చేశాడు. కలిసే మేనిఫెస్టో రిలీజ్ చేశాడు. ఆ మేనిఫెస్టోకు నాదీ పూచీ అన్నాడు. వీళ్లద్దరూ అయితే సరిపోరని వీరికి తోడు మోడీ గారి పేరు కూడా తెచ్చుకున్నారు. దారుణంగా ప్రజలను మోసం చేశారు. ఇది గత చరిత్ర. మేమంతా కలిసికట్టుగా మేనిఫెస్టోలో 5 హామీలు చెబితే... నేను దత్తపుత్రుడు కలిశాము కాబట్టి మరో 6 హామీలు ఇస్తున్నామని చెబుతారు. ఇవాళ వీళ్ల మాట్లాడుతున్న మాటలు చూస్తే నిజంగా వీళ్ల మనుషులేనా అనిపిస్తుంది.

బీ'టెక్కు' టమార విద్యలు!

- జూదం, క్రికెట్ బెట్టింగ్‌లలో సిద్ధహస్తుడు
- దౌర్జన్యాలకూ వెనుకాడని నైజం
- బీటెక్ రవిపై నమోదైన కేసులే ఇందుకు నిదర్శనాలు

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల టీడీపీ నేత బీటెక్ రవి దౌర్జన్యాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచాడు. వివాదాస్పద వ్యవహారాలకు కేంద్ర బిందువయ్యాడు. ఇద్దరి మధ్య నెలకొన్న ప్రైవేటు వ్యవహారాల్లోనైనా తనదైన శైలిలో దౌర్జన్యాలకు పాల్పడటం పరిపాటైంది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపైనా అలాంటి ధోరణినే ప్రదర్శిస్తున్నాడు. వైఎస్సార్ జిల్లాలో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇలాంటి ఓ పెండింగ్ కేసులో బీటెక్ రవిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపారు. బీటెక్ రవి ఈజీ మనీ సాధించడంలో సిద్ధహస్తుడు. ఈ క్రమంలోనే జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. బెట్టింగ్‌లో చిక్కుకుని యువత ఆత్మహత్యలు చేసుకుంటుండటంతో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ వీటి నివారణకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న పోరుమామిళ్లలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ సురేష్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. ఆ మేరకు క్రైమ్ నంబర్ 307/2023 ద్వారా కేసు నమోదైంది. ఇందులో లోతుగా దర్యాప్తు చేస్తే మొత్తం 41 మంది పాత్రధారులు, సూత్రధారుల ప్రమేయం ఉన్న ట్టు తేలింది. అందులో టీడీపీ నేత బీటెక్ రవి ఏ– 17గా ఉండటం విశేషం. ఈ క్రమంలో కోర్టులో పీటీ వారెంట్ వేసి, క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై బీటెక్ రవిని విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్రైవేటు వ్యవహారంలో సైతం..

పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం నాగులగట్టుపల్లెలో గోవిందు రామయ్యకు చెందిన భూమిని రమణ, సుబ్బయ్యలు కొని.. వెంచర్ వేశారు. స్థానిక టీడీపీ నేత మహేశ్వరరెడ్డికి వారితో వివాదం ఏర్పడితే.. ఏప్రిల్ 30న బీటెక్ రవి మందీమార్బలంతో వాహనాలతో వెళ్లి రమణ, సుబ్బయ్యలపై దౌర్జన్యం చేసి, వెంచర్‌ను సైతం ట్రాక్టర్లతో దున్నేశారు. అప్పట్లో క్రైమ్ నంబర్ 40/2023 ద్వారా కేసు నమోదైంది. ఇలాంటి పరిస్థితి పోలీసు ఆఫీసర్‌కూ ఎదురైంది. ఈ ఏడాది జనవరి 26న కడప ఎయిర్‌పోర్టుకు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వస్తున్న నేపథ్యంలో అక్కడికి బీటెక్ రవి తన అనుచరులతో కలిసి వెళ్లాడు. మూకుమ్మడిగా ఎయిర్‌పోర్టులోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్ఐ దివాకర్ అడ్డుకునే యత్నం చేశారు. బీటెక్ రవి.. అతడిని తోసేయడంతో కింద పడిపోయారు. కాలు ఫ్యాక్చర్ అయ్యింది. ఈ కేసులో బీటెక్ రవి ప్రధాన నిందితుడు. ఇలాంటివి ఆయన జీవితంలో సర్వసాధారణమని చెబుతున్నారు. కాగా బీటెక్ రవిపై 9 కేసులు వివిధ దశల్లో ఉన్నాయి.

చంద్రబాబు ప్రోద్బలంతోనే స్కిల్ కుంభకోణం

ముందే రూ.330 కోట్లు విడుదల చేసేశారు

- అతనికి బెయిల్ ఇస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం
- హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సీమెన్స్ సంస్థ తాను వెచ్చించాల్సిన 90 శాతం నిధులను ఖర్చుచేయకముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.330 కోట్లను విడుదల చేసేసిందని, దీని వెనుక కుట్ర, ముందస్తు వ్యూహాలు ఉన్నాయని సీఐడీ తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఇలా చేయడం ద్వారా రూ.214 కోట్లను పలు షెల్ కంపెనీల ద్వారా దారిమళ్లించారని తెలిపారు. నిధుల మళ్లింపును ఫోరెన్సిక్ ఆడిట్ సైతం ధ్రువీకరించిందని చెప్పారు. ఈ కుంభకోణం గత ప్రభుత్వ హయాంలోనే బయటపడిందని, దీనిపై ఏసీబీ విచారణ కూడా జరిగిందని తెలిపారు. అయితే ఈ కుంభకోణంలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉండటంతో అది బయటకు రాకుండా తొక్కిపెట్టారని వివరించారు. 2018లో జరిగిన కుంభకోణంపై సీఐడీ చేస్తున్న దర్యాప్తును రాజకీయ ప్రేరేపితమని, రాజకీయ కక్షసాధింపు అని చెప్పడం దారుణమన్నారు. ఈ కుంభకోణం వెనుక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని చెప్పారు. ఇందుకు నోట్‌ఫైళ్లే సాక్ష్యమన్నారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే రూ.330 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఈ విషయంలో ఆర్థికశాఖ అభ్యంతరాలను సైతం చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేతగా, మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఎంతో పలుకుబడి ఉందని, అందువల్ల ఈ కేసులో ఆయనకు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. పైపెచ్చు దర్యాప్తు కీలకదశలో ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబు తన ప్రధాన బెయిల్ పిటిషన్‌లో ఇప్పటివరకు వాదనలు వినిపించలేదన్నారు. వాదనలు వినిపించినట్లు ఆయన న్యాయవాదులు చెబుతున్న నేపథ్యంలో ఆ వివరాలను రికార్డ్ చేయాలని సుధాకర్ రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబు న్యాయవాదులు కేవలం మధ్యంతర బెయిల్‌పై మాత్రమే వాదనలు వినిపించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ మల్లికార్జునరావు విచారించారు.

జిల్లా వార్తలు

జంగారెడ్డిగూడెంలో రామయ్య కల్యాణం



రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల వారి ఉత్సవమూర్తులను మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ రామయ్యను దర్శించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రామయ్య భక్తుల ఆహ్వానం మేరకు ఈనెల 25వ తేదీ వరకు పది పట్టణాల్లో రామయ్య కల్యాణం నిర్వహించనున్నట్లు భద్రాద్రి ఆలయ అధికారులు తెలిపారు.

నేటినుంచి ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపిక

కొత్తగూడెంటౌన్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి పాఠశాల క్రీడాకారుల జట్లను ఈ నెల 16, 17వ తేదీల్లో ఎంపిక చేయనున్నట్లు డీఈఓలు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ నెల 16న కొత్తగూడెం రామవరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో సెపక్‌తక్రా, 17వ తేదీన అండర్–14, 17 విభాగాల్లో సైక్లింగ్ ఎంపిక పోటీలు పాల్వంచలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా పీఈటీలు చొరవ చూపాలని డీఈఓలు సూచించారు.

17, 18వ తేదీల్లో..

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఈ నెల 17, 18 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, స్టెల్లా ప్రేమ్ నిరంజన్ తెలిపారు. అండర్–14 బాస్కెట్‌బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు ఈ నెల 17, అండర్–17 బాస్కెట్‌బాల్, అండర్–14, 17 టగ్ ఆఫ్ వార్ బాలబాలికల ఎంపిక పోటీలు 18న జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

పండ్ల తోటల వైపు రైతుల మొగ్గు

- జూలూరుపాడు మండలంలో పలువురి ఆసక్తి
- విస్తృతంగా సీతాఫలం, జామ తోటల సాగు
- ఏటేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం



జూలూరుపాడులోని జామ తోట

జూలూరుపాడు: సంప్రదాయ పంటలతో సరైన లాభాలు లేకపోవడం.. చీడపీడలతో పెట్టుబడి పెరుగుతుండడం.. ఎప్పుడు ఏ ఆపద వచ్చి పంట కోల్పోతామో తెలియని పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా కాస్త శ్రద్ధ వహిస్తే చాలు త్వరగా దిగుబడి వచ్చే పంటలైన పండ్ల తోటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. జామ, సీతాఫలం వంటి పండ్ల తోటలు పెంచుతుండటంతో రైతులకు స్థిర ఆదాయం లభించడమే కాక ప్రజలకు పండ్లు అందుబాటులోకి వస్తున్నాయి.

తక్కువ కాలంలోనే చేతికి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు, కాకర్ల, మాచినేనిపేట గ్రామాల్లోని రైతులు పలువురు తైవాన్ జామ, పడమటనర్సాపురం, జూలూరుపాడు గ్రామాల రైతులు సీతాఫలం సాగు చేస్తున్నారు. తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే తైవాన్ (హైబ్రిడ్) జామను ఎంచుకోగా.. వేడితో కూడిన పొడి వాతావరణంలో కూడా ఇబ్బంది ఎదురుకావడం లేదని చెబుతున్నారు. అంతేకాక ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకుని మంచి దిగుబడి వస్తోంది. జామ మొక్కలు నాటిన ఆరు నెలల్లోనే కాపు వస్తుండగా, ఏడాదికి ఆరు సార్లు కాపు వస్తోందని చెబుతున్నారు. ఏటా ఎకరానికి సుమారు 80 నుంచి 100 క్వింటాళ్ల (8 నుంచి 10 మెట్రిక్ టన్నుల) జామ పంట దిగుబడి వస్తోంది. ఎకరం విస్తీర్ణంలో జామ పంట సాగుకు రూ.50 వేలు పెట్టుబడి పెడుతున్నారు. అయితే, ఏటా రూ.లక్ష వరకు ఆదాయం వస్తుండడంతో జామ సాగు చేసే రైతుల సంఖ్య ఏటా పెరుగుతోంది. అలాగే, పడమటనర్సాపురం, జూలూరుపాడుకు చెందిన రైతులు పలువురు నాలుగేళ్లుగా సీతాఫలం సాగు చేస్తున్నారు. మొక్క నాటితే మూడు నుంచి నాలుగో సంవత్సరం, విత్తనం మొక్క అయితే తొమ్మిదేళ్లకు దిగుబడి వస్తుంది. సీతాఫలాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యాన నష్టం ఎదురయ్యే పరిస్థితి లేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



సీతాఫలం చెట్టుకు కాచిన కాయలు

మూడెకరాల్లో జామసాగు చేస్తున్నా



పత్తి, మిరప సాగు చేస్తే నష్టం వచ్చింది. దీంతో ఎకరానికి రూ.50 వేల పెట్టుబడితో మూడేళ్ల కిందట మూడెకరాల్లో జామ సాగు చేశాను. ఏడాదిలో ఆరు సార్లు కాపు వస్తోంది. కోతుల బెడద తప్ప ఇతరత్రా ఇక్కట్లు లేకపోవడంతో సాగు లాభసాటిగానే ఉంది.

– గుండెపిన్ని వెంకటేశ్వర్లు, రైతు, జూలూరుపాడు

13 ఎకరాల్లో సీతాఫలం..



13 ఎకరాల విస్తీర్ణంలో సీతాఫలం తోట వేశాను. 2020 సంవత్సరంలో అంటు మొక్క కడితే నాలుగో ఏట పంట చేతికి వచ్చింది. ప్రతీ చెట్టుకు 50 నుంచి 100 కాయలు నాణ్యతగా రావడంతో తోట వద్దే అమ్మాను. మరికొందరికి ఆర్టీసీ కార్గోలో కూడా పంపించా.

– గుగులోత్ రాంబాబు, రైతు, పడమటనర్సాపురం

రైతులకు లాభదాయకం..



పండ్ల తోటల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. జామ పంట ఏడాదికే చేతికి వస్తుంది. జిల్లాలో సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో తైవాన్, అలహాబాద్ సఫేదా జామ సాగు చేశారు. సీతాఫలం కూడా పలువురు రైతులు సాగు చేస్తున్నారు.

– జినుగు మరియన్న, భద్రాద్రి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి

రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



అభివాదం చేస్తున్న చెన్నయ్య, నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: దళితుల వర్గీకరణ కోసం కాకుండా రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. మాల మహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను ప్రధాని మోదీ మానుకోవాలని సూచించారు. దళిత జనాభా పెరిగిందని, అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలే తప్ప దళితుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి కోసం యత్నించొద్దని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ దామాల సర్వయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌తో పాటు రమేశ్, బాలకృష్ణ, దేవదానం, దామల సత్యం, తొగరు భాస్కర్, నాగార్జున, గోపీచరణ్, ప్రభాకర్, నర్సింహారావు, సురేందర్, సురేశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మడుసు జాకోబ్, కాంతమ్మ, సుక్కమ్మ, వీరభద్రం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నతి'ని మరింత మెరుగుపరచాలి



జూలూరుపాడు: విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న రాష్ట్రబృందం సభ్యులు

బూర్గంపాడు/కొత్తగూడెంరూరల్/జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను మరింతగా మెరుగుపరచాలని విద్యాశాఖ కేంద్ర, రాష్ట్ర కమిటీల సభ్యులు సూచించారు. బూర్గంపాడు ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన వారు ఉన్నతి, లక్ష్య అమలును పరిశీలించి విద్యార్థులకు ప్రణాళికాయుతంగా బోధించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే, లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీ పరిధి ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలను ఎస్‌ఈఆర్‌టీ సభ్యులు సందర్శించి తొలి మెట్టు అమలుపై పర్యవేక్షించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సభ్యుడు ఎస్.రవికుమార్‌తో పాటు విశాల్, మురళి, కార్తీక్, జుంకీలాల్, ఎస్.శ్రీనివాస్, బాలాజీ, జ్యోతిరాణి, ఎస్కే ఖాసీంపాషా, నాగేశ్వరరావు, శౌరి ఇన్నయ్య, తపస్సుమ్, కల్యాణి పాల్గొన్నారు. కాగా, జూలూరుపాడు మండలంలోని దండుమిట్టతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను స్టేట్ కౌన్సిల్ బృందం సభ్యులు సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే, ఉన్నతి, లక్ష్య అమలుపై ఆరా తీశారు. రాష్ట్ర పరిశీలకులు అనిల్‌కుమార్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారుల ఆరోగ్యానికి రక్ష



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న మేనేజర్ రమణ

కొణిజర్ల: షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు టీకాలు వేయిస్తేనే వారి ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ లభిస్తుందని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్‌వీ.రమణ తెలిపారు. మండలంలోని తనికెళ్ల, కొణిజర్ల, పెద్దగోపతిలో వ్యాక్సినేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు టీకాలు, పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యాధికారులు సురేష్, కె.రమేష్, సీహెచ్‌ఓ మధుసూదన్‌రావు, ఉద్యోగులు జమున, సుజాత, సుభద్ర, ఉమ, మల్లికార్జున్, అనురాధ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటేలా..



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న జిల్లా జట్టు

మెదక్ జిల్లా తూప్రాన్‌లో 33వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖో-ఖో బాలబాలికల పోటీలు బుధవారం మొదలయ్యాయి. ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టు పాల్గొంటోంది. ఈ సందర్భంగా జిల్లా జట్టు ప్రతిభ చాటుతారని ఖో-ఖో అసోసియేషన్ బాధ్యులు ధీమా వ్యక్తం చేశారు. – ఖమ్మంస్పోర్ట్స్

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఆయన జూమ్ మీటింగ్ ద్వారా సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థుల్లో సీ, డీ గ్రేడ్ ఉన్నవారిని ఏ, బీ గ్రేడ్‌కు తీసుకొచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈసమావేశంలో డీడీ మణెమ్మ, అధికారులు పాల్గొన్నారు.